నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, సోమవారం 7 అక్టోబర్ 2024 | VIKARABAD

వికారాబాద్ జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నత్తకు నడక నేర్పినట్లు మొక్కుబడిగా సాగుతున్నది. ప్రభుత్వం మాత్రం మూడు నెలల్లోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించి.. అవసరమైన అధికారుల బృందాలను కూడా ఏర్పాటు చేసింది. అయినా క్షేత్ర స్థాయిలో మాత్రం జాప్యం జరుగుతూనే ఉన్నది. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు ఇంకా రెండు నుంచి మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉన్నది.

**వికారాబాద్ జిల్లాలో నత్తనడకన సాగుతున్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ**



శ్రీ శివమారుతిగీతా అయ్యప్ప మందిరంలో శ్రీ శాకాంబరీదేవి అవతారంలో అమ్మవారు



# నత్తేనయం..!

వికారాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ (అనుమతిలేని లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం) దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నత్తనడకన సాగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించి.. ఇందుకోసం ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసినా పరిశీలన మాత్రం మొక్కుబడిగానే సాగుతున్నది. మున్సిపాలిటీల్లో పలు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ప్రారంభం కాగా.. గ్రామ పంచాయతీల్లో మాత్రం ఇంకా షురూనే కాలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతోనే ఈ పథకం పనులు స్లోగా సాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. అప్లికేషన్ల పరిశీలన బాధ్యతలు చూస్తున్న బృందాలకు సొంత శాఖల పనులతోపాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు ఉండడంతోనే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో జాప్యం జరు గుతున్నదని జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్నారు. జిల్లాలో 37,313 మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకోగా.. అందులో మున్సిపాలిటీల నుంచి 21,084 దరఖాస్తులు రాగా, గ్రామ పంచాయతీల నుంచి 16,229 మంది అప్లికేషన్లు పెట్టుకున్నారు.

### ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో జాప్యం..

మూడు నెలల్లోనే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించినా ఇంకా పూర్తి కాలేదు. ఇందుకు మరో రెండు నుంచి మూడు నెలల వరకు సమయం పట్టేలా ఉన్నది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించేందుకు మున్సిపాలిటీల్లో టీపీవో( టౌన్ ప్లానింగ్ ఆఫీసర్), ఇరిగేషన్ ఏఈ, ఆర్ఐ(రెవెన్యూ ఇన్‌స్పెక్టర్) లతో బృందాలు, గ్రామ పంచాయతీల్లో ఆర్ఐ, ఇరిగేషన్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులతో కలిసి టీములను సర్కార్ ఏర్పాటు చేసింది. అయితే జిల్లాలో నీటిపారుదల శాఖలో నలుగురు మాత్రమే ఇరిగేషన్ ఏఈలున్నారు. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలకు ప్రత్యేకంగా టౌన్‌ప్లానింగ్ అధికారులు అవసరం ఉండగా.. కేవలం తాండూరు, వికారాబాద్ ము న్సిపాలిటీలకు మాత్రమే ఉన్నారు. పంచాయతీ కార్యదర్శులకు ఓటరు జాబితా బాధ్యతలు, ఆర్ఐలకు ధరణి బాధ్యతలతోపాటు రెవెన్యూ ఫైళ్లకు సంబంధించి రిపోర్టులివ్వాల్సిన పరిస్థితి నెలకొన్నది.

పరిశీలన బృందాల్లో ఉన్న ఇరిగేషన్ ఏఈలకు సంబంధించి సిబ్బంది కొరత ఉండడంతోపాటు మరోవైపు ఆర్ఐలు, పంచాయతీ కార్యదర్శులకు ఇతర బాధ్యతలుండడంతో ఎల్‌ఆర్‌ఎస్‌పై తమ దృష్టిని సక్రమంగా కేంద్రీకరించలేకపోతున్నారు. దీంతో ఆ ప్రక్రియ పూర్తి అయ్యేందుకు మరో రెండు నుంచి మూడు నెలల వరకు సమయం పట్టే అవకాశం ఉన్నది. గ్రామ పంచాయతీల్లో 16,229 మంది దరఖాస్తులు పెట్టుకోగా ఇప్పటివరకు ఒక్క దరఖాస్తు పరిశీలన ప్రక్రియ కూడా పూర్తి కాలేదు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల నుంచి 21,084 దరఖాస్తులు రాగా.. ఇప్పటివరకు 424 దరఖాస్తుల పరిశీలనను ప్రారంభించగా, ఒక్క దరఖాస్తూ పూర్తి కాలేదు. పరిశీలనలో భాగంగా ప్రభుత్వ భూమి, అసైన్డ్ తదితర వివరాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే ప్రత్యేక యాప్‌లో ఎంట్రీ చేస్తున్నారు. సంబంధిత ప్లాట్ల విస్తీర్ణాన్ని బట్టి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెగ్యులరైజ్ డబ్బులను లబ్ధిదారులు చెల్లిస్తున్నారు.

- మూడు నెలల్లో పూర్తి చేయాలని సర్కారు ఆదేశం.. అయినా క్లోజ్ కాని ప్రక్రియ
- మున్సిపాలిటీల్లో 424 దరఖాస్తుల పరిశీలన ప్రారంభం
- గ్రామ పంచాయతీల్లో ఇంకా షురూనే కాని ప్రక్రియ
- నాలుగు మున్సిపాలిటీల్లో కలిపి 21,084 దరఖాస్తులు
- గ్రామ పంచాయతీల్లో వచ్చిన దరఖాస్తులు 16,229

# జగన్మాతా.. పాహిమాం..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పలు ఆలయాలు, మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్లు ఆదివారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా, అమ్మవార్లను దర్శించుకున్న జనం భక్తిపారవశ్యంలో మునిగి తేలారు. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు ఉట్టిపడేలా సాయంత్రం సమయంలో ఆడబిడ్డలు బతుకమ్మ, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ శివమారుతిగీతా అయ్యప్ప మందిరంలో అమ్మవారు శ్రీ శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

# రేపు బల్దియాలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు

సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ఉద్యోగులు, కార్మికుల కోసం మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఆమ్రపాలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కిమ్స్, సన్‌షైన్ హాస్పిటళ్ల సహకారంతో డాక్టర్ విమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సర్కిల్, జోనల్ అధికారులతో పాటు ఆయా విభాగాల హెచ్‌వోడీలు, సిబ్బంది కార్మికులతో సహా అనారోగ్యంతో బాధపడుతున్నవారు ప్రధాన కార్యాలయానికి వచ్చి ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# నా క్లాస్‌మేట్.. బదిలీ ఆపండి..!

**జీహెచ్ఎంసీ కమిషనర్‌పై కాంగ్రెస్ నేత ఒత్తిడి**

**బదిలీ చేసినా కుర్చీ వదలనంటున్న ఏసీపీ**

**పైరవీలతో అధికార పార్టీ నేతల పెత్తనం**

**చర్చనీయాంశమైన సికింద్రాబాద్ జోనల్ ఏసీపీ వ్యవహారం**




సిటీబ్యూరో, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ ) : జీహెచ్ఎంసీ ఉద్యోగుల అంతర్గత బదిలీల్లోనూ అధికార పార్టీ నేతల జోక్యం మితిమీరుతున్నది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ (డిప్యూటీ కమిషనర్) బదిలీ అయిన చోటుకు వెళ్లకుండా ప్రభుత్వ స్థాయిలో తన ట్రాన్స్‌ఫర్ ఆర్డర్‌ను రద్దు చేయించుకొని..తిరిగి అదే పోస్టులో కొనసాగేలా మరో ఉత్తర్వు తెప్పించుకున్నారు. ఈ వ్యవహారంలో సదరు డీసీకి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నీ తానై అండగా నిలిచినట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. ఈ అంశం మరువక ముందే తాజాగా టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి సికింద్రాబాద్ జోన్‌లో పనిచేస్తున్న ఓ ఏసీపీ బదిలీ అయిన ప్రాంతానికి వెళ్లేది లేదంటూ ఆదేశాలను ధిక్కరిస్తున్నారు. పలువురు ఏసీపీలకు స్థాన చలనం కల్పించగా.. సికింద్రాబాద్ జోన్ నుంచి చార్మినార్ జోన్‌కు బదిలీ అయిన సదరు ఏసీపీ ..ట్రాన్స్‌ఫర్ అయిన చోటుకు వెళ్లేది లేదంటూ పైరవీ బాట పట్టారు. తన క్లాస్‌మేట్ అని చెప్పుకొంటున్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చెందిన కాంగ్రెస్ లీడర్, మాజీ ఎమ్మెల్యేతో కమిషనర్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఉద్యోగ విరమణకు కొన్ని నెలలు మాత్రమే ఉన్నదని, సికింద్రాబాద్‌లోనే కొనసాగించాలని ఆ మాజీ ఎమ్మెల్యే ఏసీపీ తరఫున పైరవీ ప్రారంభించారు. అయితే వారం రోజులు గడిచినా.. సదరు ఏసీపీ బదిలీ అయిన చోటుకు వెళ్లకుండా మళ్లీ ఎలాగైనా ఉన్న స్థానంలో కొనసాగేలా యత్నిస్తున్నారు. కమిషనర్ మాత్రం ఒక్కసారి బదిలీ అయ్యాక వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని చెబుతున్నారు. ఈ క్రమంలో సదరు ఏసీపీ చార్మినార్ జోనల్‌లో పోస్టింగ్ తీసుకుంటారా? లేదా? అన్నది తోటి ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది.



# ఉత్సాహంగా గ్రేస్ క్యాన్సర్ రన్

గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'రన్ ఫర్ గ్రేస్-స్క్రీన్ ఫర్ లైఫ్' అనే థీమ్‌తో గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం 'గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్-2024' కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే పరీక్షలు చేసి కట్టడి చేయవచ్చని అన్నారు. అంతకు ముందు యూస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, గివ్ లైఫ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బార్డ్ ఫీషర్ 10కే, 5కే, 2కే రన్‌లను జెండాలు ఊపి ప్రారంభించారు. నగరంతో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన దాదాపు 20 వేల మంది ఈ రన్‌లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పురుషులు, మహిళల కేటగిరీల్లో విజేతలైన వారికి మంత్రి బహుమతులు, మెడల్స్ అందజేశారు.

*- శేరి లింగంపల్లి, అక్టోబర్ 6*

### లంగ్స్ క్యాన్సర్‌ను గుర్తిస్తే ముప్పు తప్పినట్లే

సిటీబ్యూరో : ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి, సరైన చికిత్స తీసుకుంటే ప్రాణహాని తప్పుతుందని పలువురు పల్మనాలజిస్టులు తెలిపారు. ఆదివారం హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్‌లో నోడ్యూల్ సమ్మిట్-2024 ఇంటర్నేషన్ కాన్ఫరెన్స్, లైవ్ వర్క్ షాప్ పేరిట అంతర్జాతీయ సదస్సు జరిగింది. వైద్యులు డా. నాగార్జున నేతృత్వంలో పల్మనరీ మెడిసిన్ విభాగం ఈ సదస్సును నిర్వహించగా.. ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు, రోగ నిర్ధారణ, చికిత్స విధానాలు, నోడ్యూల్స్ నిర్వహణపై పాల్గొన్నవారికి అవగాహన కల్పించారు.

# ఆశలన్నీ ఓటీఎస్ పైనే..!

## ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన జలమండలి

**ప్రతి నెలా రూ.119 కోట్ల లోటుతో అవస్థలు**

**రూ.1961 కోట్ల మేర బకాయిలు రాబట్టుకునే ఎత్తుగడ**

**రూ.1660 కోట్ల బకాయిలున్న ప్రభుత్వ రంగ సంస్థలపై నజర్**

**పెండింగ్ బిల్లుల చెల్లింపునకు లేఖలు**



సిటీబ్యూరో: బల్దియా బాటలోనే జలమండలి నడుస్తున్నది. నెలవారీగా నీటి బిల్లులు, నల్లా కనెక్షన్లు, వాటర్ ట్యాంకర్ల రూపంలో రూ. 115 కోట్ల మేర వస్తుండగా... ఖర్చులు మాత్రం రెట్టింపు స్థాయిలో రూ. 234 కోట్ల మేర ఉంటున్నది. అంటే ..ప్రతి నెలా రూ .119 కోట్ల లోటుతో జలమండలి కొట్టుమిట్టాడుతున్నది. ముఖ్యంగా విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన కరెంట్ చార్జీలు రూ.3800 కోట్లు పెద్ద సవాల్‌గా మారింది. గడిచిన 10 నెలలుగా ప్రభుత్వం నుంచి ఒక్క పైసా విడుదల కాలేదు...20 కేఎల్ ఉచిత వాటర్‌కు ప్రభుత్వం నుంచి రూ.715 కోట్ల మేర రావాల్సి ఉంది. కాగా, జలమండలి సొంతంగా ఆదాయం పెంచుకునే మార్గాలు ఉన్నా..లోపాలను సరిదిద్దే సమర్థవంతమైన నాయకత్వం కొరవడింది. నల్లా కనెక్షన్ల (క్యాన్) సర్వే, గేటెడ్ కమ్యూనిటీ, ఇతర వ్యాపార సంస్థల నుంచి సీవరేజీ సెస్, డెవలప్‌మెంట్ చార్జీల సవరణ, ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాల్లో కొత్త నల్లా కనెక్షన్ల జారీ వంటి సంస్కరణలు చేపట్టాల్సి ఉంది. అధికారులు మాత్రం ఇవేం పట్టకుండా నీటి చార్జీలు పెంచకపోవడం వల్లే భారం పెరుగుతున్నదని చెబుతుండటం గమనార్హం. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి రూ.1660 కోట్లు, ప్రైవేట్, డొమెస్టిక్ వినియోగదారుల నుంచి సుమారు రూ. 300కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉంది. దీంతో తెరపైకి ఓటీఎస్‌ను మళ్లీ తీసుకువచ్చి ఈ నెలాఖరు వరకు అమలు చేస్తున్నారు.

### వన్ టైం సెటిల్‌మెంట్..

నీటి బిల్లు బకాయిదారులకు ప్రభుత్వం వన్ టైం సెటిల్‌మెంట్ అవకాశాన్ని కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు చేసింది. 7.18 లక్షల కనెక్షన్లకు ఓటీఎస్ వర్తించనున్నది. వీటి నుంచి రూ. 1961 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉండగా, ఇందులో రూ.705 కోట్ల మేర వడ్డీ మాఫీ కానుంది. రూ. 1255 కోట్ల మేర బకాయిలు వసూలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

### ప్రభుత్వ శాఖలకు లేఖలు..

సుమారు 40 ప్రభుత్వ రంగ సంస్థల నుంచి రూ. 1660 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. వైద్య ఆరోగ్య రూ. 56.30 కోట్లు, హౌసింగ్ రూ.33 కోట్లు, ఇరిగేషన్ రూ. 21 కోట్లు , పంచాయతీ రాజ్ రూ. 37కోట్లు, మిషన్ భగీరథ రూ. 82 కోట్లు, పురపాలక రూ. 26 కోట్లు, సాధారణ పరిపాలన రూ. 12 కోట్లు, హోం రూ. 27 కోట్లు తదితర శాఖలు నీటి బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలకు జలమండలి లేఖలు రాయనున్నది.